# రూపా రూపాలు

నేను బస్టాండ్‌లో అడుగుపెట్టేసరికి విజయవాడ-గుంటూరు నాన్‌స్టాప్ బస్సు రెడీగా వుంది. రెండు అడుగులు వేగంగా వేసి బస్సు ఎక్కాను. గుమ్మంలో అడ్డంగా నుంచున్న ఒకతను "టిక్కెట్టు బుక్కింగ్‌లో తీసుకోవాలండీ" అన్నాడు.

నేను అతనికేసి చూశాను. ఆ చూపులో నిరసన మెరిసే వుంటుంది. కారణం - నా జేబులో వున్న వారంటు. నేను ఆర్.టి.సి. ఉద్యోగిని.

"స్టాఫ్" అన్నాను. అతనేమీ మాట్లాడలేదు. కిటికీ పక్కన సీటులో సర్దుకుని కూర్చున్నాను. జనం ఎక్కువగా లేకపోవడం వల్ల ఒక్కొక్కరే వచ్చి నచ్చిన సీటు చూసుకుని కూర్చుంటున్నారు.

నేను సన్నగా పొట్టిగా వుండడంవల్ల చాలామంది నన్ను కుర్రాడినే అనుకుంటారు. వాళ్ళు అలా అనుకోవడం నాకేమీ బాధగా వుండదు. ఆనందంగానే వుంటుంది. నేను ఎకౌంటెంట్ హోదాలో వున్నానని గాని, బలమైన యూనియన్‌కి పట్టుకొమ్మ లాంటి వాడిననిగాని నన్ను చూసి ఎవ్వరూ అనుకోరు. మా ఆఫీసరు నన్ను 'బోయ్' అని వ్యవహరించినపుడు నాకెంతో ఆనందంగా వుంటుంది. ఆఫీసులో ప్రతివాడూ "పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు" "పిట్ట కొంచెం కూత ఘనం" వగైరా మాటలతో ఎగతాళి చేస్తుంటే అది నా ప్రతిభకి గుర్తింపు అనిపిస్తుంది.

ఎవరేమన్నా నా పనే నాకు మరో విషమం పట్టించుకోను.

డ్రైవర్ ఎక్కాడు ఎస్.ఆర్. తీసుకుని టిక్కెట్లు లెక్కపెట్టుకోవడం మొదలు పెట్టాడు.

అతన్ని చూసి నాకు గుండె ఝల్లుమంది. ఎందుకో భయమేసింది. నల్లగా - ఆరడుగుల ఎత్తు మనిషి - మూతిమీద మూరెడు గుబురు మీసం. అతని ఆకారాన్ని మరింత భయంకరంగా చేస్తోంది. సినిమాల్లో మేకప్ చేసిన గుండాలా యెడం చెంపమీద కత్తిగాటు, నుదిటిమీద కుడివైపు నల్లనిమచ్చ.

అతని రూపంచూసి అతను కర్కోటకుడై వుండాలని నేను నిర్ణయించుకున్నాను.

బస్సులో ఎవరైనా టిక్కెట్టు తీసుకోవాలా అంటూ ఒక్క కేక పెట్టాడు. ఆ కంఠం కూడా కర్కశంగానే వుంది.

ఆలోచనల్లో పడి నేను "స్టాఫ్" అని, నా దగ్గర వారంటు వుందని చెప్పడం మర్చిపోయాను.

అతను లెక్కపెట్టడం మొదలుపెట్టాడు. పత్తికాయల్లాంటి అతని కళ్ళు ఒక్కొక్క మనిషిమీంచీ అతివేగంగా దొర్లుతున్నాయి, ఆ చూపు నా దగ్గర ఆగింది. వెంటనే నేను "స్టాఫ్" అన్నాను.

"చంపారు పొండి. మరి చెప్పరేంటీ..." అని "పోనుందా" అన్నాడు.

నాకెంతో అవమానం అన్పించింది. వెంటనే గర్వంగా "వారంట్" అన్నాను. అంతే! అతను ఒక్కుదుటున స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. అతని బరువుకి బస్సంతా వూగిందా! అనిపించింది. బస్సు స్టార్టు చెయ్యడం, సర్రున ముందున్న బస్సుని దాటించి అదేపనిగా హారన్ మోగించుకుంటూ దూసుకుపోవడం ఒకేసారి జరిగాయి. గేట్లోంచి రోడ్డుమీద కొచ్చి జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ వేగాన్ని పుంజుకుంది బస్సు.

ఆ వేగానికి నాలుగున్నరడుగుల ఎత్తూ, పీలగా, అర్భకంగా వున్న నేను సీట్లో కూర్చోవడం కష్టమవుతోంది. నా పాదాలు పూర్తిగా క్రింద ఆనడం లేదు. బరువు తక్కువ కావడం వల్ల ఎటుపడితే అటు ఒరిగి పోతున్నాను. డ్రైవర్‌మీద ఎక్కడలేని కోపం, అశక్తత వల్ల చిరాకు, అహంకారం వల్ల కసి నాలో పొంగుకొచ్చాయి. బస్సు హైవే మీద కొచ్చింది. రోడ్డుమీద వెళ్తోందో, గాలిలో తేల్తోందో తెలీడం లేదు. భయంతో గుండెలు దడదడ లాడుతున్నాయి. "ఈ రోజుతో భూమ్మీద నూకలు సరి" అనుకున్నా. ముందున్న ప్రతి వాహనం క్షణాలమీద వెనకబడుతోంది.

నలభైమంది ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆ నరరూప రాక్షసుణ్ణి చూస్తూ నాకు వళ్ళు మండిపోయింది. ఏర్ హారన్‌తో చెవులు చిల్లులు పడుతున్నాయి. దానికి

తోడు బస్సు వేగానికి గాలివల్ల నాకు ఊపిరి సలపడం లేదు. నేనొక్కణ్ణే యిలా అనుకుంటున్నానా – అంతా యింతేనా? అని చుట్టూ చూశాను. మిగిలిన వాళ్ళందరూ హాయిగా కూర్చున్నారు. అప్పటికే కొందరు నిద్దర్లో జారుకున్నారు. బస్సుకు మించిన శబ్దంతో కొందరు మాట్లాడుకుంటున్నారు. లేడీస్ సీట్లో కూర్చున్న ఒకమ్మాయి మాత్రం నాకేసే చూస్తోంది. ఆమె పెదవుల మీద నవ్వు నన్నుడికించింది.

డ్రైవరు మీద మరింత కసి పెరిగింది. నా కసి పెరుగుతున్న కొద్దీ బస్సు వేగం పెరుగుతోందా అన్పించింది.

మంగళగిరి ఊళ్ళోకి వచ్చినపుడు తప్పనిసరై వేగం తగ్గింది. ఊరి పొలిమేరలో పంచాయితీ వారి "నమస్తే" గిర్రున తిరిగి మాయమయింది. మళ్ళీ మామూలే! అంతటి సామ్యవాద భావాలు కలవాణ్ణి ఒక్కసారి దేవుణ్ణి స్మరించాను. ఈ బస్సు గుంటూరు చేరదు అని నిర్ధారణ చేసేసుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాను. వెనకనుంచి "అయ్యో" అంటూ అరిచారెవరో. బస్సు సడన్ బ్రేకుతో ఆగింది. నా తల యెదురుగా వున్న యినపకమ్మీకి కొట్టుకుంది. ప్రాణం జిల్లార్చుకుపోయింది. సన్నగా, తెల్లగా పిండి బొమ్మలాగున్న ఒకామె వాంతి చేసుకుంటోంది. "ఆమె పావుగంటనుంచీ బాధపడుతోంది" అన్నారెవరో.

నాకు భలే సంతోషం వేసింది. నలుగురూ కలిసి ఆ డ్రైవరు అంత వేగంగా బస్సు నడుపుతున్నందుకు చీవాట్లు వేస్తారు – తగిన శాస్తి జరుగుతుంది అయినా అంత పొగరేమిటీ అని సంబరపడటం మొదలు పెట్టాను.

కానీ, ఎవ్వరూ ఆ విషయం ఎత్తలేదు. డ్రైవరు వెనక్కొచ్చి "ఏమ్మా చెప్పక పోయావా, ఆపేవాణ్ణిగా?" అన్నాడు ఎంతో దయగా.

అప్పుడతని ముఖంలో నేనంత క్రితం వూహించిన కాఠిన్యం లేదు. అతని కళ్ళల్లో ఆ అర్భకురాలిమీద ఎంతో జాలి కనిపిస్తోంది. అతని గుబురు మీసాలూ, కత్తిగాటూ ఇవన్నీ అతని మనసులోంచి పొంగే కరుణకీ, ఆప్యాయతకీ అడ్డు రాలేదు. నాకెంతో ఉక్రోషంగా అనిపించింది. "బస్సు అంత స్పీడుగా పోతే మామూలు వాళ్ళకే ప్రాణాలు ఎగిరిపోతున్నాయి" అన్నా నుండబట్టలేక.

"బస్సు స్పీడుగా కాకపోతే చీమలా పోతుందా సార్" అన్నారెవరో.

"మరే మరే" అని అంతా తలలూపారు. నన్నెవరూ సమర్థించలేదు. ఆమె మెల్లగా బస్సు దిగింది. నేను కిటికీలోంచి తల బయటకు పెట్టి చూస్తున్నాను.

డ్రైవరెక్కణ్నించో చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి ఆమె కిచ్చాడు. ఆమె ఆ నీళ్ళతో ముఖం కడుక్కుని కొంచెం తేరుకుని బస్సెక్కి మెల్లగా సీటులో జారగిలబడింది.

"రైట్" అన్నారెవరో డోర్ మూస్తూ. బస్సు ఒక్కుదుటున కదిలింది. అరనిమిషంలో వేగాన్ని అందుకుంది.

గుండె ధైర్యంలేని నేను మాత్రం గట్టిగా కళ్ళు మూసుకుని కూర్చున్నాను.